క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి సన్మానం



టీచర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

వీణవంక: మండలంలోని బేతిగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచర్ చందుపట్ల రామ్మూర్తి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థానంలోకి తీసుకెళ్లారని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ రామనంద్, గ్రామస్తులు మాసాడి మాదవరావు, గొట్టిముక్కల రవీందర్‌రావు, ఇడుమాల ఐలయ్య, కంబాల ఐలయ్య, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మహోన్నత

జమ్మికుంట: మున్సిపల్ పరిధి 22వ వార్డులో వావిలాల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహోన్నత వ్యక్తిగత, పరిసరాల శుభ్ర, సిజనల్ వ్యాధులు, డ్రై డేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పూలమ్మ, సూపర్‌వైజర్ రత్నకుమారి, ఏఎన్‌ఎంలు మంజుల, రజిత ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి లోనుకావొద్దు

వీణవంక: విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకావొద్దని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కళాశాలలో మానసిక ఒత్తిడి నియంత్రణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మానసిక ఆరోగ్య విభాగంలో పని చేస్తున్న సైకాలజిస్ట్ రమణారెడ్డి హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సిగరెట్, పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల నోటి, లంగ్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని, ప్రతీరోజు వ్యాయామం, యోగా చేయాలని సూచించారు.

తాడికల్‌లో ఫీవర్ సర్వే



నీటి నిల్వలను పరిశీలిస్తున్న వైద్యులు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో సోమవారం వైద్యశాఖ అధికారులు, సిబ్బంది ఫీవర్ సర్వే చేపట్టారు. ఇటీవల ఓ బాలుడు డెంగీ బారినపడగా కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో తల్లిదండ్రులు వైద్యం చేయించారు. కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రావణ్, సీహెచ్‌వో భాస్కర్, ఏఎన్‌ఎంలు జ్వరంతో బాధపడుతున్న ఐదుగురిని గుర్తించారు. నీటి నిల్వలను పరిశీలించారు. మంగళవారం తాడికల్‌లో మెగా హెల్త్‌క్యాంపు నిర్వహిస్తున్నామని వైద్యాధికారి తెలిపారు.

చేనేత దినోత్సవ పోటీలు



గెలుపొందిన విద్యార్థులు

మానకొండూర్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో సోమవారం చేనేత దినోత్సవ పోటీలు నిర్వహించారు. చేనేత వస్త్రాల ప్రాముఖ్యత, పాత్రపై వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్, పోటీలు నిర్వహించారు. ప్రతీ పాఠశాల నుంచి 8, 9వ తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పెయింటింగ్‌లో ఎం అక్షయ, కె.కవిత, మణికంఠ, వ్యాసరచనలో ఎస్.మానిక్య, బి. వైష్ణవి, ఎం.నవ్య ప్రథమ, ద్వితీయ బహుతులు పొందారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ మధుసూదన్‌రావు, టీచర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

వీణవంక: కాంగ్రెస్ తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ వీణవంక మండల సీనియర్ నాయకుడు మాసాడి మాదవరావు అన్నారు. మండలంలోని బేతిగల్ గ్రామంలో సోమవారం మాట్లాడారు. రైతులకిచ్చిన మాట ప్రకారం రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేసిందని, ఆరు గ్యారంటీలు త్వరలోనే పూర్తి స్థాయిలో అమలవుతాయని, ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

ఆదమరిస్తే అంతే..

- ప్రమాదకరంగా కల్వర్టులు
- రక్షణ గోడలు లేక భయం భయంగా ప్రయాణం
- అధికారులు స్పందించాలని కోరుతున్న వాహనదారులు, ప్రయాణికులు



ధర్మరాజుపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ప్రమాదకరంగా కల్వర్టు



జూపాక గ్రామానికి వెళ్లే దారిలో గుంతలమాయంగా కల్వర్టు రోడ్డు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల మధ్యలోని కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనదారులు కల్వర్టుల వద్ద ఆదమరిస్తే పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులపై నిత్యం వందలాది మంది వివిధ పనుల నిమిత్తం జమ్మికుంట, హుజూరాబాద్, కరీంనగర్, వరంగల్, పరకాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారుల మధ్యలోని కల్వర్టులు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రమాదకర కల్వర్టులు

మండలంలోని కనుకులగిద్దె, ధర్మరాజుపల్లి, కాట్రపల్లి, సింగాపూర్ నుంచి వెన్కెపల్లి రోడ్డు, వెంకట్రావ్‌పల్లె, సిర్సపల్లి, పోతిరెడ్డిపేట, జూపాక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి కల్వర్టులున్నాయి. వీటికి ఇరువైపులా రక్షణ లేకపోవడంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. జూపాక గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో కల్వర్టు పూర్తిగా ధ్వంసమైంది, ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జిపై నుంచి రాకపోకలు మరింత ఇబ్బందికరంగా మారాయి. కనుకులగిద్దె నుంచి ధర్మరాజుపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు భయాందోళను చెందుతున్నారు. రాత్రుల్లో ఈ దారుల గుండా వెళ్లడానికి జంకుతున్నారు.

మూల మలుపుల వద్ద మరీ ఘోరం

ఇటీవల కురిసిన వర్షాలకు మూల మలుపుల వద్ద పిచ్చిమొక్కలు, గడ్డి ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కానరాక ప్రమాదాల బారిన పడుతున్నారు. కల్వర్టుల సమీపంలోనే మూల మలుపులు ఉండటంతో ఒకేసారి మలుపు తిరిగే భారీ వాహనాలు అదుపు తప్పి బోల్తాపడే అవకాశం ఉందని, ఈ ప్రాంతాల్లో ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో రాత్రివేళ దగ్గరకి వచ్చే వరకు కల్వర్టులు కనిపించటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టులకు రెండు పక్కలా రక్షణ గోడలు నిర్మించాలని, మూల మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రాత్రివేళ భయమేస్తోంది...



హుజూరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాను. హుజూరాబాద్‌కు కనుకలగిద్దె నుంచి నిత్యం ద్విచక్ర వాహనాంపై వెళ్తాను. గ్రామ శివారులోని కల్వర్టుకు రక్షణ గోడ లేకపోవడంతో రాత్రివేళ భయమేస్తోంది. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కిందపడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలి.

– కానుగంటి రవీంద్రనాథ్, టీచర్, కనుకులగిద్దె

కల్వర్టు కనిపించడం లేదు



ప్రైవేట్ స్కూల్ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. నిత్యం ఆయా గ్రామాల పిల్లలను పాఠశాలకు తీసుకొచ్చే క్రమంలో కల్వర్టుల వద్ద నెమ్మదిగా వెళ్తున్నాను. వర్షాలకు కల్వర్టుల వద్ద పిచ్చిమొక్కలు, గడ్డి ఏపుగా పెరిగింది, మట్టి కుంగింది. కల్వర్టు సరిగ్గా కనిపించడం లేదు. వాహనం అదుపు తప్పితే అంతే పరిస్థితి.

– నిమ్మల సురేశ్, డ్రైవర్, ధర్మరాజుపల్లి

రైల్వే సమాచారం

జమ్మికుంట నుంచి ప్రతీరోజు నడిచే రైళ్ల సమాచారం

జమ్మికుంట – కరీంనగర్, బల్లార్షా(ఎగువ) వైపు

12761:	తిరుపతి– కరీంనగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్	05.26 గంటలకు
17003:	రామగరి మేము ఎక్స్‌ప్రెస్– కాజీపేట్– సిర్‌పూర్ టౌన్	06.05 గంటలకు
17011:	ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ –హైదరాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	07.55 గంటలకు
17033:	సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ – భద్రాచలం టూ బల్లార్షా	10.01 గంటలకు
12757:	కాగజ్‌నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ –సికింద్రాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	10.43 గంటలకు
12721:	దక్షిన్ ఎక్స్‌ప్రెస్ – హైద్రాబాద్ టూ హాజరాయ్ నిజామొద్దిన్	(రాత్రి)1.44 గంటలకు
12771:	రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్– సికింద్రాబాద్ టూ రాయ్‌పూర్ జంక్షన్	(రాత్రి)1.04 గంటలకు
12791:	ధానాపూర్ ఎక్స్‌ప్రెస్– సికింద్రాబాద్ టూ ధానాపూర్	11.34 గంటలకు
116093:	లక్నో ఎక్స్‌ప్రెస్(బుధ,శని)– ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ టూ లక్నో జంక్షన్	18.08 గంటలకు
17233:	భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ – సికింద్రాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	18.25 గంటలకు
17035:	కాజీపేట్ బల్లార్షా ఎక్స్‌ప్రెస్– కాజీపేట్ టూ బల్లార్షా	23.18 గంటలకు

జమ్మికుంట – కాజీపేట్, వరంగల్(దిగువ) వైపు రైళ్లు

12772:	రాయ్‌పూర్ సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్– రాయ్‌పూర్ టూ సికింద్రాబాద్	04.11 గంటలకు
17234:	భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ – సిర్‌పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	05.44 గంటలకు
17036:	బల్లార్షా కాజీపేట్ ఎక్స్‌ప్రెస్– బల్లార్షా టూ కాజీపేట్	07.20 గంటలకు
17012:	ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ – సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	13.55 గంటలకు
17034:	సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ సిర్పూర్ టౌన్ టూ భద్రాచలం	14.45 గంటలకు
16032:	అండమాన్ ఎక్స్‌ప్రెస్(ఆది,సోమ,గురు) – శ్రీమాతా వైష్ణోదేవి కత్రా టూ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్	15.34 గంటలకు
16094:	లక్నో ఎక్స్‌ప్రెస్ (మంగళ, శుక్ర)–లక్నో జంక్షన్ –ఎంజీఆర్ చెన్నైసెంట్రల్	16.09 గంటలకు
12758:	కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్– సిర్‌పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	16.30 గంటలకు
12792:	సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్– దానాపూర్ టూ సికింద్రబాద్	17.42 గంటలకు
12722:	దక్షిణ్ ఎక్స్‌ప్రెస్– నిజామొద్దీన్ టూ హైదరాబాద్ జంక్షన్	23.19 గంటలకు
17004:	రామగిరి ఎక్స్‌ప్రెస్ –బల్లార్షా టూ కాజీపేట్	19.09 గంటలకు
12762:	కరీంనగర్ తిరుపతి ఎక్స్‌ప్రెస్(గురు,శుక్ర) కరీంనగర్ టూ తిరుపతి	20.24 గంటలకు





శంకరపట్నం: మండలంలో తారురోడ్లు గుంతలమయంగా తయారయ్యాయి. కన్నాపూర్‌-రాజాపూర్, రాజాపూర్-మొలంగూర్, రాజాపూర్-కాచాపూర్, మొలంగూర్- కేశవపట్నం, చింతలపల్లి-లింగాపూర్, సింగాపూర్ క్రాస్-మెట్‌పల్లి వరకు రోడ్డుపై ఉన్న గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్ పనులు చేపట్టడంలేదన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. వర్షాలకు రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. – రెడ్డి రవి, రాజాపూర్, శంకరపట్నం మండలం

వాట్సప్ చేయండి.. **మా ఫోన్ నంబర్ : 87901 44227**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

స్వచ్ఛదనం-పచ్చదనం



హుజూరాబాద్: విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



చొప్పదండిలో ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో సోమవారం స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు నాటారు, వివిధ రకాలు పోటీలు, ర్యాలీలు చేపట్టారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత పౌరులందరిపై ఉంటుందని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం, మానవాళిపై తీవ్ర ప్రభావం చూపెడుతుందన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు, ఐకేపీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, మహిళ సంఘాల సభ్యులు, పట్టణాల్లో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట: అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న



శంకరపట్నం: స్వచ్ఛదనం- పచ్చదనంపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

తిమ్మాపూర్/గన్నేరువరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు తర్వాత మొదటిసారి నియోజకవర్గానికి విచ్చేసిన మానకొండూరు ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణకు మాదిగ సామాజిక వర్గ నాయకులు సోమవారం బెజ్జంకి స్టేజి వద్ద ఘన స్వాగతం పలికారు. రేణికుంట టోల్ గేట్ వద్ద గజమాలతో సన్మానించారు. అల్గునూర్ చౌరస్తా వరకు భారీ బైక్ నిర్వహించి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పు రాగానే ఉద్యోగాల భర్తీలో వర్గీకరణ అంశాన్ని పరిగణలోకి తీసుకుంటామని ముఖ్యమంత్రి ప్రకటించారని, ఈనెల 16 లేదా 17న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగ సమ్మేళనం కార్యక్రమానికి జిల్లా నుంచి మాదిగలు వేలాదిగా తరలిరావాలని కోరారు. కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వీణవంక: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారని మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుకతిరుపతిరెడ్డి ప్రకటనలో తెలిపారు.

రేపు ప్రత్యేక పూజలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో 7న తొమ్మిది గంటలకు గోదాదేవి అమ్మవారి జన్మదినం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ పూజారి డింగిరి సత్యనారాయణాచార్యులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

● **లక్ష్య సాధనకు శ్రమించాలి**

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు లక్ష్య సాధన కోసం శ్రమించాలని మండలంలోని సింగాపూర్ వీఎస్ఆర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శనిగరపు రజిత అన్నారు. సోమవారం కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు ఆశయాలను నెరవేర్చాలన్నారు.

● **పోస్టర్ ఆవిష్కరణ**

హుజూరాబాద్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి జాతీయ వారోత్సవాల పోస్టర్లను జై గౌడ ఉద్యమం జిల్లా అధ్యక్షుడు అనపురం తిరుపతి గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరమండ్ల సదానందం గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షుడు మ్యాడగోని శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు కందాల రాజు గౌడ్, హుజూరాబాద్ అధ్యక్షుడు శ్రీపతి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్‌లోని సర్వాయి పాపన్న విగ్రహం వద్ద సోమవారం ఆవిష్కరించారు. 11న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జయంతి వారోత్సవాల కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు.

● **పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్స్**

చొప్పదండి: పట్టణంలోని మున్సిపల్ కార్మికులకు గుర్రం చిన్న ఎల్లారెడ్డి ట్రస్టు తరపున రెయిన్‌కోట్స్ సమకూర్చగా సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, కమిషనర్ నాగరాజు పంపిణీ చేశారు. వర్షాకాలంలో కార్మికులకు ఇబ్బంది రాకుండా ఉండేందుకు ట్రస్టు నిర్వాహకులు శైలేందర్ రెడ్డి, శశిధర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, వంశీధర్‌రెడ్డి, సుజిత్ రెడ్డి, చంద్రకళ, శశికళ, సృజన రెయిన్‌కోట్స్ విరాళంగా అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, మేనేజర్ ప్రశాంత్, కౌన్సిలర్లు కొట్టె అశోక్, నాయకులు నలుమాచు రామకృష్ణ, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, కొత్తూరి నరేశ్, దండె క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● **ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి**

చొప్పదండి: ఆత్మరక్షణకు విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని ఎస్ఐ జి.అనూష అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో జరిగిన 38వ షోటాఖాన్ కరాటే ఛాంపియన్‌షిప్ 2024 పోటీల్లో గెలుపొందిన పట్టణంలోని లిటిల్స్ హైస్కూల్ విద్యార్థులను సోమవారం ఎస్ఐ ఘనంగా సన్మానించారు. పి. హర్షవర్ధన్, కె. సహస్ర, ఎ. అరవింద్ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్, ఎం. నీరజ, బి. శ్రీహిత, వై. రేశ్వంత్, బి. సాయిచరణ్ బ్రౌంజ్, బృందన్, సాయి కేతన్, రితీశ్, అక్షయ సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరంతా 2025 జనవరిలో జరిగే ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. విద్యార్థులను ప్రోత్సహించిన కరస్పాండెంట్ కడారి రవికుమార్, కరాటే మాస్టర్ సుంకె రాజును ఎస్ఐ అభినందించారు.

● **శత లింగార్చన**

గన్నేరువరం: శ్రావణ మాసం పురస్కరించుకొని మండలంలోని ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయంలో సోమవారం అష్టవింశోత్తర శత లింగార్చన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. అలాగే పారువెల్లలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో శ్రావణ మాసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.

● **స్పందన ఆశ్రమంలో పండ్ల పంపిణీ**

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి స్పందన అనాథ ఆశ్రమంలో బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి రాజీవ్ ఠాకూర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి, స్వీట్లు, పండ్లు పంపిణీ చే శారు. ఆశ్రమ నిర్వాహకులు గోపరాజు వీరస్వామి, నాయకులు రాజ్‌కుమార్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

● **ఆర్థిక సాయం**

వీణవంక: మండల కేంద్రానికి చెందిన కోరె కళావతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న టూరిటో సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి సోమవారం మృతురాలి కుటుంబానికి రూ.ఐదువేలు అనుచరుల ద్వారా అందించారు. మాజీ జడ్పీటీసీ ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

● **'గద్దర్ వర్ధంతి విజయవంతం చేయండి**

జమ్మికుంట: ఐదు దశాబ్దాలుగా ప్రజల హక్కుల కోసం ఉద్యమించిన, ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సభ విజయవంతం చేయాలని ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు రామంచ్ భరత సోమవారం ప్రకటనలో పిలుపునిచ్చారు.

హుజూరాబాద్: ప్రజల కోసం జీవితం అంకితం చేసిన గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ శనిగరం బాబ్జి కోరారు. రవీంద్రభారతిలో జరిగే వర్ధంతి సభకు కవులు, కళాకారులు, మేధావులు, కార్మిక, కర్షక, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

● **నిత్యావసర సరుకులు అందజేత**

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కళాకారుడు అనగోని పర్శయ్యగౌడ్ కుటుంబ సభ్యులకు శ్రీలక్ష్మి గణపతి యూత్ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామంలో ఎవరికైనా ఆపదవస్తే తాము అండగా ఉంటామని యూత్ సభ్యులు తెలిపారు.

తల్లిపాల వారోత్సవాలు

హుజూరాబాద్: తల్లిపాల వారోత్సవాలు ఏటా ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని హుజూరాబాద్ ఐసీడీఎస్ సీడీపీవో సుగుణ తెలిపారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం-02లో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టాలని, తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజశ్రీ, పోషణ్ అభియాన్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు జయ, అరుణ, పద్మ, సుకన్య, సబిత, పావని, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్: ర్యాలీ నిర్వహిస్తున్న అగన్‌వాడీ సిబ్బంది

మానకొండూర్: మండలంలోని దేవంపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి కార్యక్రమానికి హాజరై పిల్లలకు అక్షరభ్యాసం, అన్నప్రాసన చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

క్రైం వార్తలు

గుండెపోటుతో మార్కెట్ డైరెక్టర్ మృతి

చొప్పదండి: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ ఆర్నకొండ గ్రామ అధ్యక్షుడు ఎల్లాల ఆదిరెడ్డి(45) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. ఉదయం అస్వస్థతగా ఉందని కుటుంబ సభ్యులకు తెలియజేయగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆదిరెడ్డి ఆకస్మిక మృతితో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అంతిమయాత్రలో పాల్గొన్నారు. మృతదేహానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నివాళి అర్పించారు. సోమవారం పచ్చదనం– పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా, మార్కెట్ డైరెక్టర్ ఆకస్మిక మృతితో రద్దు చేశారు.

పత్తి పంటపై గడ్డి మందు పిచికారీ

ఇల్లందకుంట: మండల పరిధి మల్యాల శివారులోని వాగొడ్డు రామన్నపల్లి గ్రామంలో పత్తి పంట ధ్వంసం చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధిత రైతు తెలిపిన వివరాలు.. తెప్ప కొమురయ్య తనకు ఉన్న భూమిని చింతం చంద్రమోహన్‌కు ఏడాది క్రితం విక్రయించాడు. చంద్రమోహన్ పత్తిపంటను సాగు చేయగా సోమవారం కొమురయ్య అతని కుమారుడు విజయ్‌పాల్ పంటపై గడ్డి మందు పిచికారీ చేశారు. డబ్బులు తీసుకొని పట్టా చేయకుండా మోసం చేసినందుకు గతంలో కొమురయ్యపై చీటింగ్ కేసు నమోదు చేశామని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

హుజూరాబాద్: పట్టణానికి చెందిన అనుప్‌రాజ్ సోమవారం అయ్యప్పస్వామి దేవాలయం వద్ద సెల్‌ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్పందించిన సీఐ తిరుమల్ వివరాలు సేకరించి గంటల వ్యవధిలోనే సెల్‌ఫోన్‌ను వెతికి అనుప్‌రాజ్‌కు అప్పగించారు. టౌన్ సీఐ తిరుమల్, పోలీసులకు అనుప్‌రాజ్ కృతజ్ఞతలు తెలిపాడు.

ఒకరిపై ఫిర్యాదు

హుజూరాబాద్: సివిల్ సప్లై అధికారులు సీఎంఆర్ ఒకరికిచ్చి బియ్యం మాత్రం తనను అడుగుతున్నారని, దీనికి కారణమైన సదరు వ్యాపారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మిల్లు యాజమాని సమ్మిరెడ్డి తెలిపారు. పట్టణ సమీపంలోని పరమేశ్వర ఇండస్ట్రీస్ మిల్లును 2016లో సత్యనారాయణ అనే వ్యాపారికి ఏడాది లీజుకు ఇచ్చానని ఇదే అదనుగా భావించి తన సంతకాలను ఫోర్జరీ చేసి 2021-22 సంవత్సరానికి సంబంధించి రూ.రెండు కోట్ల ధాన్యాన్ని అమ్ముకున్నట్లు తెలిసిందని, ఆ వ్యాపారి అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా, విషయం తెలుసుకున్న అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తూ తనకు నోటీసులు పంపారని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

● **ఫ్రెండ్స్ చేయూత**

సైదాపూర్: వెన్కెపల్లి ఉన్నత పాఠశాల 1999–2000 పదో తరగతి విద్యార్థిని గొడిశాల శ్రీలతకు సోమవారం పూర్వ విద్యార్థులు రూ.25 వేలు, నిత్యావసర సరుకులు అందజేశారు. శ్రీలత భర్త ఇటీవల మృతి చెందగా ఆమెకు ఇద్దరు పిల్లలు, శ్రీలతకు అండగా నిలవాలని ముందుకు వచ్చారు.